"డాక్టర్‌గారూ! డాక్టర్‌గారూ!"

డ్యూటీరూమ్‌లో పడుకొని ఉన్న నాకు పైపున ఎవరో పిలిచి లేపినట్లనిపించింది. పిలుపు అతి దీనంగానూ, చాలా ఆర్తంగానూ ఉంది. చివాలున లేచి లైటువేసి, తలుపు తెరిచాను. 50 ఏండ్ల వయస్సుగల వ్యక్తి. భారీ శరీరం. బుర్రమీసాలు, పెద్దకళ్ళు. చాలా ఠీవిగా ఉన్నాడు. లాల్చీ తొడుక్కొని ఉన్నాడు. పట్టంచు ధోవతీ కట్టుకొని ఉన్నాడు. చాలా కలతగా, ఆదుర్దాగా ఉన్నాడు.

"మీరు త్వరగా రావాలి డాక్టరు గారూ! కింద నా కొడుకు చాలా ప్రమాదస్థితిలో ఉన్నాడు. ఇంకెవరూ డాక్టర్లు లేరక్కడ. మీరే రక్షించాలి!" చాలా ప్రాధేయత, నమ్రత కనిపించాయా కంఠంలో.

గడియారం చూశాను. అర్ధరాత్రి పైబడింది. గంట ఒకటిన్నర. వెంటనే బాగ్ పట్టుకొని కాజువాలిటీ వైపు నడిచాను. అతడు నన్ను వెంబడిస్తూ "మీ రెలాగైనా నా బిడ్డ ప్రాణాలు కాపాడాలి డాక్టరుగారూ. నా కొక్కడే కొడుకు. నా పేరు సింహాచలం. ఈ ఊరిలో రిక్షా ఓనర్లందరిలో నాదే పైచేయి. మీ కెంత కావలిస్తే అంత డబ్బిస్తాను. మీ శ్రమ ఊరికే ఉంచుకోను" అన్నాడు.

"చూడండి సింహాచలం గారూ! డబ్బు ప్రాణాల్ని రక్షిస్తుందా! అలాగైతే ధనవంతులకు చావే లేదన్న మాట. ముందు నన్ను కేసు చూడనివ్వండి."

లోపలికి వెళ్ళాను. పాతికేళ్ల యువకుడు. మంచి స్ఫురద్రూపి నిండైన విగ్రహం. బాగా కండలు పెంచి ఉన్నాడు. తలా ఒళ్ళూ రక్తసిక్తంగా ఉంది. స్పృహ లేదు. "ఊం. అమ్మా అమ్మా" అంటూ మధ్య మధ్యలో మూలుగుతున్నాడు.

పరీక్ష చెయ్యడం మొదలుపెట్టాను. తలకు తీవ్రమైన గాయాలు తగిలాయి. అధికంగా రక్తస్రావం అవుతూంది. వెంటనే రక్తస్రావం ఆగేందుకు కొన్ని ఇంజెక్షన్లు ఇచ్చి తలకు కట్టుకట్టి ఆ ప్రమాదం జరిగిన వివరాలు సేకరించడం మొదలుపెట్టాను.

అతని పేరు రాజా. సింహాచలం కొడుకు. మిలిటరీలో పనిచేస్తున్నాడు. గత మూడు సంవత్సరాలుగా సెలవు దొరకక ఇంటికి రాలేదు. ఇప్పుడు రెండు నెలలు సెలవుమీద ఇంటికి వస్తున్నాడు. ఈ రాత్రి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చాడు. సింహాచలం కొడుకు కోసం స్టేషన్‌కు వెళ్ళాడు. రైలింకా స్టేషన్ ఆగనే లేదు. కంపార్టుమెంట్ ద్వారం దగ్గిర తలుపు తెరిచి కమ్మీలు పట్టుకొని వేలాడుతూ అల్లంత దూరాన్నుండే "నాన్నా. . . నాన్నా..." అని అరిచాడు. మిలిటరీ సాహసం చూపుతూ దూకేశాడు. ప్లాట్‌ఫారం మీద పడిపోయాడు. దగ్గిరే ఉన్న స్తంభానికి గుద్దుకున్నాడు. తలమీ తీవ్రంగా గాయం తగిలింది. సింహాచలం ప్రాణం తల్లడిల్లిపోయింది. వెంటనే అంబులెన్సుకు ఫోను చేసి రప్పించి రాజును వేసుకొని హాస్పిటల్‌కు చేరాడు. టూకీగా ఇదీ జరిగింది.

"డాక్టర్‌గారూ! ఎలా ఉన్నాడు రాజా? వాడి పరిస్థితి చూస్తే నాకు



# ఋణగ్రస్తుడు

–శిరీష

గుండె ధైర్యం చాలడం లేదు. మతి లేకుండా పడిపోయి ఉన్నాడు. ఏమీ ప్రమాదం లేదుగదా?" చాలా గద్గదికంగా ఉంది స్వరం.

"అతని పరిస్థితి చాలా ప్రమాదకరంగానే ఉంది. వెంటనే రక్తం ఇవ్వాలి. మీరు నా వెంట రండి." రాజు రక్తం తీసుకొని బ్లడ్‌బాంక్ వైపు నడిచాను. నన్ను వెంబడించాడు సింహాచలం.

"వీడు నాకు ఒక్కగా నొక్క కొడుకు. నేను దరిద్రుడిగా పుట్టి చిన్నప్పుడు ఎంతో బీదరికం అనుభవించాను. నా శక్తి సామర్థ్యాలవల్ల పైకివచ్చి కావలిసినంత ఆస్తి సంపాదించాను. నా కట్టే చదువుల మీద నమ్మకం లేదు. పిల్లవాణ్ణే స్కూలుఫైనల్ దాకా చదివించి తరవాత ఏదైనా మంచి వ్యాపారం పెట్టుకోమన్నాను. పెట్టుబడికి వెతుక్కోనక్కర లేదు. నా మాట వినలేదు వీడు. నాకు చెప్పకుండా వెళ్ళి మిలిటరీలో చేరాడు. మూడు సంవత్సరాల తరవాత ఈ రోజు దిగాడు ఎంతో ఆత్రతతో ఆనందంతో ఇంటికి తీసుకువద్దామని వెళ్ళాను స్టేషనుకు. ఈ రూపంలో విధి నా చేతిలోకి చేర్చింది వీణ్ణి. డాక్టరుగారూ! మీకు తెలియదు నేను పడుతున్న మానసికవేదన. వాడు తల్లిలేని వాడు నా వంశానికి జీవగర్ర. వాడికోసం నా ప్రాణాలైనా ఇస్తాను వాణ్ణి రక్షించండి. . ." అలా చెప్పుకొని పోతూనే ఉన్నాడు. ఇలాంటి ఆర్తనాదాలకూ, దైన్యజీవితాల ఆక్రందనలకూ, రోగుల మనఃపరితాపాలకూ రోజూ అలవాటు పడిపోయిన నేను మూగగా వింటూ నడుస్తున్నాను.

బ్లడ్‌బాంక్ వచ్చింది. రాజురక్తం గ్రూపుచేసి పరీక్ష చేశాను. అతని రక్తానికి సంబంధించిన రక్తం కోసం బ్లడ్‌బాంక్‌లో వెతికాను. సరిపడే రక్తం దొరకలేదు.

"చూడండీ! వెంటనే అతనికి రక్తం ఇవ్వడం ముఖ్యం. ఇక్కడ అతనికి సరిపడే రక్తం లేదు. మీ రక్తం తప్పక సరిపోతుంది. మీ రాజు కోసం మీ రక్తం ఇవ్వాలి."

ఈ మాటలు వింటూనే సింహాచలం ముఖంలో మార్పు కనిపించింది. ఏదో [illegible] ఆవరించినట్లు గోచరించింది.

"నా రక్తమా! ఆ. . . నే నిప్పటి వరకూ ఒక్క మాత్రమందు కూడా వేయించుకొన్న పాపాన పోలేదు. అదీగాక నే నీమధ్యనే జబ్బు పడ్డాను. చాలా బలహీనుణ్ణి అయిపోయాను. . . అదీగాక నాకు అమితమైన భయం."

అతన్ని చూస్తే జబ్బుపడ్డ మనిషిగా లేడు.

"ఫరవాలేదు. మీ కేమీ ప్రమాదం లేదు. ఏ మాత్రం నీరసం కలగకుండ సరిపడేంత రక్తమే తీస్తాను."

నేను పట్టుదలగా ఉన్నాననుకున్నాడేమో? "లేదండీ డాక్టరుగారూ! నేను మీ కెంతైనా డబ్బిస్తాను. ఇక్కడ రక్తం అమ్ముతారటగా. కొని ఇవ్వండి."

నా కెంతో ఆశ్చర్యం వేసింది. ఇంతకు మునుపే వాడి కోసం నా ప్రాణాలైనా ఇస్తానన్న ఈ తండ్రేనా ఇలా మాట్లాడడం అనిపించింది. డబ్బుతో అన్నిటినీ కొనాలనుకొనే



అతన్ని చూస్తే నాకు ఏవగింపుకూడా కలిగింది.

"చూడండి! డబ్బు డబ్బు అంటూ పదేపదే చెబుతున్నారు. ఇక్కడ రక్తం దానం ఇచ్చినందుకు మేమే డబ్బిస్తాము. ఏ దిక్కూలేని వాళ్లకు ఆ రక్తం వాడుతాము. నేనే మీకు డబ్బిస్తాను. మీరే ఇవ్వండి ఆ రక్తం. డబ్బుతో రక్తం కొనగలగడం అంత సులభమయ్యే పక్షంలో నే నిప్పుడు మీ దగ్గర కొనగలగాలి గదా! ఎంతో ఆత్మీయత పెంచుకొన్న మీ కొడుక్కి మీరు రక్తం ఇవ్వలేకపోతే ఇంకెవర్నో డబ్బుకు రక్తం ఇవ్వమనడం న్యాయమంటారా! మీ కేమీ ఫరవాలేదు. నే నెంతో జాగ్రత్తగా తీస్తాను. మీ రక్తమే ఇవ్వండి. ఆలస్యం అయితే అక్కడ ప్రమాదం తప్పదు."

లోపలికి వెళ్లాను రక్తం తీయడానికి కావలసిన పరికరాలు సిద్ధం జేయడానికి. అతను వరండాలో నిల్చొని ఉన్నాడు.

అన్నీ సిద్ధం చేసుకొని సింహాచలాన్ని పిలవడానికి వరండాలోకి వచ్చాను. విచిత్రం. . . అతను అక్కడ లేడు. కూర్చొని ఆలోచిస్తున్నాను, అతడు తిరిగి వస్తాడన్న ఊహతో.

మనిషి మనుగడ చాలా విచిత్రమైనది. మనఃప్రవృత్తి అతిదారుణంగా మారుతూంటుంది కొన్ని సమయాలలో. ప్రాణ సమానంగా చూసుకుంటున్న ఒక్కగా నొక్కడైన తన కొడుకుని రక్షించుకొనేందుకు ఎంత డబ్బైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాడీ సింహాచలం. ఆ రక్షణకు తన రక్తం తోడ్పడుతుందంటే తను రక్తం ఇవ్వడానికి సిద్ధంగా లేడు. తన రక్తంలో ఉన్నది తన ప్రాణాల తీపి. జీవితంలో తియ్యనిదైన ఏ వస్తువునూ పోగొట్టుకోలేడు మనిషి. తన దాకా వస్తే తప్పించుకొని పిరికిగా పారిపోతాడు. ఈ సమయంలో నాకొక చిన్నకథ గుర్తుకు వచ్చింది.

బీర్బల్ కుశాగ్రబుద్ధికి పెట్టింది పేరు. ఆయన నమ్మకాలు చాలా దృఢమైనవి. ఎన్నోసార్లు అక్బరుతో జీవతత్వాన్ని గురించి తర్కించేవాడు. మనిషన్న వాడెప్పుడూ స్వాభావికంగా స్వాపేక్ష కలిగి ఉంటాడనీ, అది తన ప్రాణాందాకా వస్తే భార్యాబిడ్డలనుకూడా తన ప్రాణానికై త్యాగం చెయ్యడానికి సిద్ధపడతాడనీ వాదించాడు ఒకనాడు అక్బరుతో. ఈ వాదానికి అక్బరు మతరామూ ఒప్పుకోలేదు. తన దృష్టిలో మనిషి భార్యాపుత్రులకై తన ప్రాణాల్ని కూడా త్యజించడానికి వెనకాడడని ఆయన వాదన. తన సిద్ధాంతంమీద ప్రభువును ఒప్పించాలని బీర్బల్ ఒక చిన్నపని చేశాడు. ఒక కోతిని తెచ్చాడు. అది తన పిల్లను పొట్టకు అంటించుకొని ఉంది. కోతినీ దాని పిల్లనూ ఒక తొట్టెలో పెట్టాడు. తొట్టెలో క్రమంగా నీళ్లు పోస్తూ వచ్చాడు. కోతి నిల్చొని ఉంది. దాని పొట్టనంటుకొని దానిపిల్ల ఉంది. నీళ్లు క్రమంగా కోతిపొట్ట వరకూ వచ్చాయి. వెంటనే కోతి తన పిల్లకు రక్షణగా పిల్లను తీసి తన భుజాలమీద ఎక్కించుకొంది. ఇంకా నీళ్లు పోస్తూనే ఉన్నాడు. నీళ్లు కోతి భుజాలదాకా వచ్చాయి. కోతి పిల్లనుతీసి నెత్తిన ఎక్కించుకొనింది. నీళ్లింకా పోశాడు. కోతికంటి (దా)కా వచ్చాయి. ఇంక తను నీళ్లలో మునిగిపోతాననే భయం కోతికి వచ్చింది. వెంటనే పిల్లను తీసి తొట్టెలోపడేసి దానిమీద ఎక్కి నిల్చుంది కోతి. ఈ దృశ్యం అంతా చూసి అక్బరు ఆశ్చర్యపోయాడు. ఈ ఉదాహరణతో తన వాదన ఓడిపోయింది.

అలాంటి జంతులక్షణమే కనిపించింది నా కీనాడీ సింహాచలంలో. నా ఆలోచనలను చెదరగొడుతూ, "బాబుగారూ! ఇదుగో నే నొక మనిషిని తీసుకొని వచ్చాను. వీడు రక్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. వెంటనే తీయండి. ఆలస్యం చేస్తే నా బిడ్డ నాకు దక్కడు!" హడావుడిగా అన్నాడు సింహాచలం.

"ఉండండి! ఇతని రక్తం సరిపోతుందో లేదో మీ వాడికి పరీక్ష చేస్తాను."

వాణ్ణి చూశాను. చాలా బీదవాడుగా ఉన్నాడు. అతనినుండి రక్తం తీయాలంటే నా మనస్సెందుకో ఒప్పుకోవడం లేదు. కానీ ప్రమాదస్థితిలో ఉన్న రాజును రక్షించాలంటే ఇక గత్యంతరం లేదు. అతని రక్తం పరీక్ష చేశాను. అదృష్టవశాత్తూ సరిగ్గా సరిపోయింది. వెంటనే పడుకోబెట్టి ఏ మాత్రం ప్రమాదం లేకుండా అతిజాగ్రత్తగా అవసరానికి సరిపడేంత రక్తం తీశాను. లేబిల్ వేసి నర్సుతో రక్తం హాస్పిటల్‌కి పంపించాను. వెంటనే రాజుకు రక్తం ఎక్కించమని చెప్పి పంపి, రక్తం దానం ఇచ్చిన అతనికి కొన్ని ఉపచర్యలు చెయ్యడానికి లోనికి వెళ్లాను. నర్సుతోబాటు సింహాచలంకూడా వెళ్లిపోయాడు.

అతడింకా పడుకొని ఉన్నాడు. నీరసంగా ఉన్నాడు. ఆ నీరసంలోనే చెప్పుకు పోతున్నాడు.

"పోనీబాబూ! నా రక్తం ఇలాగా రాజుబాబు ప్రాణాన్ని కాపాడడానికి ఉపయోగపడుతుందంటే నా కదేతృప్తి. దీనివల్ల నాఋణంకూడాతీరిపోతుంది."

"నువ్వేం పని చేస్తావు?" అడిగాను.

"రిక్షా తొక్కుతాను బాబయ్యా! సింహాచలంగారే ఇచ్చారు రిక్షా. నాలుగు రోజుల్నించి అదీ మానేశాను."

ఇంకా కొన్ని విషయాలతన్ని గురించి తెలుసుకోవాలనిపించింది. "ఏం? ఎందుకు మానేశావు?" అడిగాను.

"మొన్నొక ఆక్సిడెంటు అయింది బాబూ! నా తలరాత. ఆ రోజు నిద్దరలేచి ఎవరి మొహం చూశానో రిక్షాకొక ప్రక్కంతా గుద్దేసింది. రిక్షా రిప్పేరు కావాలి. దానికి యాభై రూపాయలు ఖర్చౌతాయనుకొని ఇంకొక రిక్షా ఇవ్వడానికి కుదరదన్నాడు సింహాచలం బాబు. యాభై రూపాయలు ఎక్కడ తెచ్చి ఇవ్వను బాబూ? ఇదిగో, ఈ రోజు పొద్దుటే ఆ బాబే వచ్చి రాజుబాబుకు రక్తమివ్వమని ప్రాధేయపడ్డారు. దానికి తగిన బహుమానం ఇస్తున్నారు. రక్తమిస్తే యాభై రూపాయలూ కొట్టేస్తానన్నారు. పోనీలే బాబూ నా వల్ల రాజుబాబు బతికిపోతాడు. ఈ నీరసం ఎప్పుడూ ఉండేదే. ఏదో నా ఋణమన్నా తీరితే రేపట్నుంచి యథాప్రకారం రిక్షాని తొక్కుకోవచ్చు. ఈ రోజు ఈ సంఘటనే జరిగి ఉండకపోతే నా ఋణం తీరేదికాదు. నాకు రిక్షా దొరికేదీ లేదు."

తిండికి పేదవాడైనా నా కెంతో ఉదారత్వం కనిపించిందాతని దృక్పథంలో. ధన్యత్వం గోచరించిందాతని త్యాగంలో. మానవత నుండి ఎంతో అతను పైకి పెరిగినట్లనిపించిందాతని మాటల్లో. మనిషి జీవితంలోని విలువలు గుర్తించిన నాడే అతనికి ఆస్తికత చేకూరుతుంది. అది లేనినాడు అతను నాస్తికుడే.


* * *

నాలుగు నెలలు గడిచిపోయింది. జైలులో ఖైదీలనుండి రక్తం తీసుకు

---

డబ్బు ఉన్న మనిషి మనసుని అంచనా వేయడం కష్టం. డబ్బు ఉన్నది, దానితో ఏమైనా చెయ్యగలమన్న నమ్మకం అహంకారాన్ని పెంచుతుంది. మమతను, మానవత్వాన్ని నశింపజేస్తుంది. పరాయివారి విషయంలోనే కాదు, కన్నవారి విషయంలో కూడా కఠినంగా ఉండగల కరకుతనాన్ని సంక్రమింపజేస్తుంది. ఏమైనా కష్టంలో ఆదుకొనే శక్తి మాత్రం కష్టాలలో కాపురం ఉండే వారికే ఉంటుంది.

---



చిత్రం — ఎమ్. శంకర్రావు (విశాఖపట్టణం)



దుర్గ

ఫోటో — గున్నేశ్వరరావు గోవింద్ (ఖరగ్‌పూర్)

వచ్చే ఆచారం ఎప్పట్నుంచో ఉంది. మా హాస్పిటల్‌లో ఆ రోజు జైలుకు వెళ్లాను రక్తం తీసి పట్టుకురావడానికి. ఒకసారి వెళ్లి ఇరవై, ముప్ఫై మంది ఖైదీలనుండి రక్తం తీస్తే కొన్నాళ్లు గడిచిపోతుంది మా రోగులకు. ఇలాగైనా ఖైదీలు తోటిమానవుల ప్రాణ రక్షణకు తోడ్పడుతున్నారంటే ఈ నియమాన్ని విధించి పాటింపజేస్తున్న ప్రభుత్వాన్ని అభినందించాలి. ఇందువల్ల పరోక్షంగా మనస్సంతృప్తి పొందుతున్న ఖైదీలుకూడా శ్లాఘనీయులే.

వరసగా నిల్చొని ఖైదీలపేర్లు నమోదు చేయించుకుంటున్నారు. ఒక్కొక్కరిదే రక్తం గ్రూపుచేసి వ్రాసుకుంటున్నాను.

"బాబూ! నన్ను మరిచిపోయారా!" ఎక్కడో పరిచయమున్న కంఠంలా ఉంది. తల పైకెత్తి చూశాను. అతన్ని గుర్తించేటప్పటికి కాసేపు పట్టింది. ఆ వాడు సింహాచలం కొడుక్కి రక్తదానం చేసిన రిక్షా వాడతను.

"ఏం! జైలులో ఎందుకున్నావు?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఏమి చెప్పమంటారు బాబూ? నా రక్తదానంవల్ల మా రాజాబాబు బ్రతికిపోయాడు. నా కంతే చాలు. నే నెందుకు జైలులో పడ్డానంటారా! ఇది ధనవంతుల పైశాచిక చర్య బాబూ."

"అంటే!" అర్థంకాక అడిగాను.

"సింహాచలంగారి ఇంట్లో చోరీ జరిగిందట బాబూ! నా మీద అనుమానపడ్డారా బాబు. పోలీసులు తెచ్చి ఇక్కడ పెట్టారు." సింహాచలం ఇతన్ని పోలీసులకు అప్పజెప్పాడంటే నమ్మ శక్యం కాలేదు.

"ఏం బాబూ! సందేహిస్తున్నారా! నా మంచితనాన్ని ఇలాగా వాడుకున్నారా బాబు. మా రిక్షాకూలీ లందరిలోనూ నేనే ఆ బాబుగారింటికి అడపాదడపా వెళుతూంటాను. ఆ పనీ, ఈ పనీ జేస్తే ఆయమ్మగారు కొంచెం తిండి పెట్టేవారు. ఏదో పొట్ట గడుస్తుందని తీరిక దొరికినప్పుడల్లా వెళుతూండేవాణ్ణి. రాజాబాబు బ్రతుకుమీది మొక్కుబడి తీర్చుకొనేందుకుగాను ఆ మధ్య సింహాచలంగారు కుటుంబంతో సహా తిరుపతికి వెళ్లారు. ఓ వారం రోజులపాటు. ఇంటికి కాపలిగా నేనే వెళ్లి పడుకొనేవాణ్ణి. తిరిగివచ్చి ఇంట్లో ఏదో వస్తువులు పోయాయని పోలీసురిపోర్టిచ్చారు. నా మీద అనుమానమున్నదని చెప్పారట ఆ బాబుగారు. నన్నిక్కడ తగలేశారు, పోలీసులు. ఇలాంటి సమయాల్లో ప్రతి ఒక్కరికీ అనుమానం మాలాంటి వాళ్లమీదనే. దీనితో మళ్లీ నా కొంప యథాస్థితికి వచ్చి ఉంటుంది."

ఒకవేళ నిజంగానే ఇతను దొంగిలించి ఉంటేకూడా సింహాచలం ఇతన్నిమన్నించి తన ఔదార్యాన్ని ప్రకటించి ఉండాలనిపించింది నాకు.

జైలరు వచ్చాడు. "వీళ్ల మాటలు నమ్మకండి డాక్టరుగారూ! దొంగ వెధవలు! దొంగ ఎప్పుడైనా తన దొంగతనాన్ని ఒప్పుకుంటాడా? ఇలాంటి వాళ్లిక్కడ కొంతకాలం ఉండి వెళ్లితే గానీ వీళ్లకు తిక్క కుదరదు"! తన ఉద్యోగపద్ధతిలో చెప్పాడు.

మళ్లీ నా పనిలో నిమగ్నమైపోయాను. అతని నుండి రక్తం తీస్తున్నప్పుడనిపించింది నాకు. . . ఇతను రక్తమిచ్చి సింహాచలం ఋణం తీర్చుకున్నాడు. ఇతను రక్త మిచ్చిన ఋణం సింహాచలం ఎప్పటికీ తీర్చుకోలేడు. అతనెప్పటికీ జీవితంలో ఋణగ్రస్తుడే. ★